ఉదయం పదకొండు గంటలకి.

అనకాపల్లి కోర్టుహాలు ప్రేక్షకులతో కిక్కిరిసిపోయింది.

నానీ తల్లి మరణం తెలిసిన తుంపాల ప్రజలేకాకా కొన్ని రోజులుగా నానీ కథని పత్రికల్లో చదివిన చాలా మంది నానీని చూడాలని వచ్చారక్కడికి.

పావని హత్యలో ఎక్యూజ్డ్ గా రప్పించబడిన చంద్రం, కాంతం, సరళ, రాజారావులతో బాటు తాతయ్య విశ్వేశ్వరశాస్త్రి కూడా అక్కడున్నాడు.

బోనులోకి అడుగు పెట్టిన మనవడ్ని చూడగానే విశ్వేశ్వరశాస్త్రి కళ్ళు ఆనందభాష్పాలతో నిండిపోయాయి.

కోర్టు హాలంత టెన్షన్‌గా చూస్తూంది ఇప్పుడు పెదవి విప్పబోయే నానీని.

"యువరానర్..... పందొమ్మిదివందల ఎనభై అరు ఆగస్టు ఎనిమిదో తేదీన తుంపాల గ్రామ వాస్తవ్యురాలైన శ్రీమతి వేదుల పావని అనబడే యువతి కాలిన గాయాలతో హాస్పిటల్లో అడ్మిట్ చేయబడినపుడు మెడికో లీగల్ కేస్‌గా ధృవపరచబడింది. న్యాయమూర్తి సమక్షంలో మరణవాంగ్మూలం రికార్డ్ చేయబడింది అయితే తర్వాత పోలీసు పరిశోధనలో మరణించే ముందు శ్రీమతి పావని చెప్పినట్టు ఆమె గాయపడింది ప్రమాదం మూలంగా కాదని ఒక పథకం ప్రకారం ఆమెపై హత్యా ప్రయత్నం జరిగిందని రుజువు కావడంతో సుమారు పదకొండు రోజుల క్రితం హత్య చేయాలన్న తలంపు ప్రేరణ, హత్యకోసం పధకం అనే అభియోగాలతో ప్రతివాదులపై చార్జిషీటు దాఖలు చేయబడింది. అయితే ఈ సంఘటనలో అతి కీలకమయిన సాక్షి మాస్టర్ నానీ కొన్ని అనుకోని పరిస్థితుల్లో అదృశ్యం కావడంతో కేసు ఎడ్జార్న్ మొదలై కోర్టు వారిని ఆర్థించడం జరిగింది యువరానర్! ఇండియన్ ఎవిడెన్స్ ఏక్ట్ ప్రకారం న్యాయమూర్తి సమక్షంలో మరణ వాంగ్మూలం రికార్డు చేయబడినా అది అనుమానించదగ్గది అయినప్పుడు అందులో నూరుశాతం వాస్తవం లేదని కోర్టు అభిప్రాయ పడినప్పుడు ఆ సంఘటనకి ప్రేరణని అందులోని దోషుల్ని విచారించడం తప్పనిసరని చట్టం నిర్దేశించిన సూత్రమే కాబట్టి న్యాయమూర్తి కేసు పూర్వాపరాలని పరిశీలించాల్సిందిగా కోరుతూ కొన్ని విషయాలను ఇక్కడ స్పష్టం చేయదలుచుకున్నాను.

యువరానర్..... ఇది నాట్ ఏక్సిడెంట్ బట్ కేసాఫ్ బ్రొటల్ బార్బేరియన్ మర్డర్....

నానీ శాశ్వతమయిన నిజంలాంటి అమ్మ దానికి అబద్ధమైనందుకు కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. కాని అమ్మ చివరగా చెప్పిన అబద్ధానికి కలవరపడ్డాడు.

అమ్మ ఆ చివరి క్షణాల్లో అబద్ధమెందుకు మాట్లాడిందో అర్థంకాక తాతయ్యని నిలదీశాడు.

అంతే.....! ఇన్‌స్పెక్టర్ యశస్వి
నానీ చేత నిజం చెప్పించే ప్రయత్నంలో నిమగ్నమయ్యాడని తెలిసి అంతా నానీని కడతేర్చాలనుకున్నారు....
తను మంచంపై నుంచి లేవలేని
స్థితిలో మిగిలిన తాతయ్య ఆ పసికందు నూరేళ్ళు బ్రతకాలని బ్రతికించే మందు తెమ్మని ప్రపంచంలోకి సాగనంపాడు. నానీ
సత్యానికి తిరుగులేని
సాక్ష్య మై ఒక సంఘటనలో ఇన్‌స్పెక్టర్ యశస్వి చేత రక్షింపబడి ఇలా రప్పించ బడ్డాడు.

యువరానర్..... నానీకి హత్య గురించి మాత్రమే కాదు. ఆ హత్యకు మూలమయిన మోటివ్స్ కూడా తెలుసు. ఒక
ఆదదానితో అక్రమ సంబంధం పెట్టుకుని భార్యని కడతేర్చి
అంతకు మించి కన్న కొడుకునే చంపాలని ప్రయత్నించిన ప్రతివాది చంద్రంఒక కిరాతకుడు.
అతడి కందులో సహకరించిన చంద్రం తల్లి
కాంతమ్మ, చెల్లి సరళ, నానీని చంపాలని వెంటాడిన రోజు రాత్రి చంద్రం అక్రమ సంబంధమేర్పరచుకున్న కామేశ్వరి అంతా ప్రత్యక్షంగా పరోక్షంగా యీ నేరంలో పాలుపంచుకున్నవారే.

కట్టుకున్న వాడి కేమన్నా కష్టం కలిగితే కన్నబిడ్డ ఏమవుతాడో అన్న భయంతో అబద్ధమాడి వీళ్ళందర్నీ రక్షించిన పావని లేదు. కాని నిజం వుంది. అదీ నానీ రూపంలో. ఎవిడెన్స్ ఏక్ట్ 32 ప్రకారం హత్య చేయబడిన పావని ఈ కోర్టు ప్రాంగణంలో మరోసారి వాంగ్మూలంచ్చే అవకాశం లేదు కాబట్టి నానీని పరీక్షించి అత్తా, ఆడబడుచుల ఆరళ్లతో భర్త పశుత్వానికి మరో ఆడపిల్ల బలి కాకూడనంత కఠినంగా దోషుల్ని శిక్షించాలని కోరుతున్నాను."

"నీ పేరు...?" నానీని అడిగాడు న్యాయమూర్తి.
"నానీ"
"మీ నాన్న పేరు?"
"చంద్రం."
"మీ అమ్మగారి పేరు"
"పావని"
"నీకు నిజం అంటే ఇష్టమా"
తలూపేడు నానీ.

“నిజం అంటే”

కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు “సూర్యుడులాంటిదన్నమాట.”

“ఎవరు చెప్పారు?”

“తాతయ్య”

“మీ తాతగారి పేరు”

“అరుగో....” వేలుపెట్టి చూపించాడు “ విశ్వేశ్వరశాస్త్రి అన్న మాట”

“నిజం సూర్యుడిలాంటిదెలా అవుతుంది?”

“చాలా పెద్దగా వెలుగుతుందిగా”

“కానీ ఎపుడూ వెలగదుగా.... మరి వెలిగేదైతే చీకటెందుకొస్తుంది?”

“చీకటంటే అది ఉట్టుట్టికి అన్నమాట..... మరేమో.....అప్పుడు కూడా సూర్యుడు వెలుగుతూనే వున్నాడన్నమాట.”

“వెలిగితే ఎప్పుడూ వెలుగే వుండాలిగా...... చీకటెందుకు పడుతుంది” రెట్టించాడు న్యాయమూర్తి.

“ఎందుకంటే భూమి తిరుగుతుందిగా ..... అంటే అబద్ధం లాగనన్నమాట - అప్పుడు సూర్యుడు మన్కి కనిపించడు. అంతే అంకుల్స్ సూర్యుడు అప్పుడు కూడా ఇంకెక్కడో వెలుగుతూందన్నమాట”

యశస్వి పెదవులపై సన్నని చిరునవ్వు.....

తన ప్రయత్నం మరి కొన్ని క్షణాల్లో ఫలించబోతూంది.